# వెలుగు చూసిన వ్యక్తులు

శ్రీరామమూర్తి మద్రాసులో ఎమ్.ఎస్.సి. ఫిజిక్సు చదువుతూ వేసంగి సెలవలకు రైలులో నాగరాజు పాలెం వద్ద దిగి, కూలివాడికి పెట్టె, బెడ్డింగు తెమ్మని రెండు మైళ్ళ దూరంలో వున్న స్వగ్రామం బంగారుపల్లెకు నడక సాగించాడు.

అది ఉయం వేళ, ఎనిమిది గంటల సమయం. యింకో గంటపోతే వేసంగి సెగ ప్రారంభం కావచ్చు. ప్రస్తుతానికి ఆ కంకర రోడ్డు చెట్ల మధ్య వస్తుంటే చల్లగాలి తగుల్తున్నది - రోడ్డు పక్క పొలాల్లో అక్కడక్కడా పచ్చగా వున్న నారుమళ్ళ మీదుగా హుషారుగా అనుకోని సంతోషంతో మనసు నిండింది శ్రీరామమూర్తికి - పట్నం కన్న పల్లెటూరు వాతావరణం మనిషికి మెరుగని భావిస్తూ.

స్వగ్రామం బంగారుపల్లె వూరిబయట ముప్పాతిక మైలు దూరంలో రోడ్డు మీదుగా గొడ్ల పిల్లకాయలు అప్పుడే వచ్చి, రోడ్ల పక్క బర్రెగొడ్లను మేపుకుంటూ, చెట్లకింద బచ్చాలాట కొంతమంది, చెట్లమీద కోతికొమ్మంచి కొంతమంది ఆడుకుంటం గమనించాడు, నడిచొస్తున్న శ్రీరామమూర్తి.

"ఏవూరు?" అనడిగింది పదహారేళ్ళొచ్చిన పిల్ల కనకం, బచ్చాలాట ఆపి.

"ఆ కనపడే మీరొచ్చిన వూరే" అన్నాడు శ్రీరామమూర్తి తీర్చిదిద్దినట్టు వుండి - మోకాళ్ళదాకా చీరె దోపుకున్న కనకాన్ని వింతగా చూస్తూ.

"ఎవరి పిల్లగాడివీ?" అడిగింది కనకం ఆనవాయితీ ప్రకారం.

"శివశాస్త్రి బాబాయి అన్న కొడుకును. మా అమ్మనాన్నలు చిన్నప్పుడే పోయినారు. నువు మావూరి పిల్లవు కాదల్లే వుందే" అన్నాడు శ్రీరామమూర్తి.

"మావూరు గుంటూరుకు పది మైళ్ళ దూరంలో వుంటది. నీ చివశాత్తిరి బాబాయి యీడ యిస్కోలు మాస్టారు అవటాన నాకెప్పుడైనా సందేల పాటాలు సెబతాడు-" అని కనకం అంటుండగా గొడ్లపిల్లకాయ రంగడు, "ఎహె, ఎహె - బర్రెగొడ్డు నాగయ్యగారి నారుమళ్ళ కాడికి ఎల్తావుండై, లగెత్తవేందిరా ఎంకటాయ్ - కనకం, నీ దున్నపోతుల జత, సూడి బర్రె గూడా వుండయ్. లగెత్తు లగెత్తు-" అనరిచాడు నారుమళ్ళవేపు

పరుగెత్తుతూ. వెంటనే ఆ గొడ్ల పిల్లకాయల వెనక పైకి దోపుకున్న చీరెతో పరుగెత్తుతున్న కనకాన్ని వింతగా చూస్తున్న శ్రీరామమూర్తి తన పెట్టె, బెడ్డుతో ముందు పోతున్న కూలివాడు, "వూరు దెగ్గర కొచ్చింది, యిగ రావయ్యా పెద్దమడిచీ–" అని అరవటం విని తొందరపడి, బంగారుపల్లె వేపు కదిలాడు.

వూరి మొగదల్లో వున్న మందువా లోగిలికి బయట ప్రహరీగోడ పెద్ద గేటు పక్క పెద్ద రాతి అరుగు మీద చుట్ట కాలుస్తూ కూచుని "చివిశాత్తిరి గారి అన్నకొడుకు, శీరామమూర్తివి గాదు నువూ? సెన్నాపట్టంలో సదువుతున్నా వంటగా?" అని ఆ వూరి పెద్ద యాభై అయిదేళ్ళ పెదరామయ్య శ్రీరామమూర్తి వూళ్లోకి రావడం చూసి అడిగాడు – పద్ధతి ప్రకారం.

"అవును రామయ్య పెదనాన్నా. ఎమ్.ఎస్.సి. మొదటేడు పరీక్షలైనయి – వేసంకాలం సెలవల కొస్తున్నా" అన్నాడు శ్రీరామమూర్తి పెద్దరికం పాటిస్తూ.

"అబ్బా! పెద్ద సదువేనే! ఆడ సానా కరుజవుద్దనుకుంటా! మీ బాబాయిని సిక్కుల్లో పెట్టకుండా కాత్తె ఒల్లు దగ్గర పెట్టుకుని బాగా సదవాల, తెల్చిందా? ఎల్లిరా!" అన్నాడు పెదరామయ్య పెద్దమనిషి తీరులో.

యింటికి చేరంగానే బాబాయి శివశాస్త్రి, కాముడు చిన్నమ్మల క్షేమం తెలుసుకున్న శ్రీరామమూర్తిని, "పరీక్షలు బాగా రాసినట్టేనా?" అనడిగాడు బాబాయి శివశాస్త్రి.

"రాసినట్టే బాబాయ్. ఎక్కడా అప్పీల్లేదు!" అన్నాడు శ్రీరామమూర్తి.

ఆ సాయంత్రం శ్రీరామమూర్తితో అన్నాడు, బాబాయి శివశాస్త్రి – "నీకు మంచిరోజులు ముందు వుంటయ్యని నేనాశపడ్తానురా రాముడూ. నీ భార్య నీకు దక్కకుండా పోవలసింది కాదు. మీ నాన్న అమ్మలు పోతూ ఆస్తిపాస్తులకు అప్పులు మిగల్చడం జరక్కుండా వుండవలసింది. ప్రస్తుతం మీ ఆర్థిక సదుపాయాలు కాస్త కరుగ్గా వున్నయ్ మరి – ఆ వివరాలన్నీ నీ బుర్రకెక్కించడం లేదనుకో. మిగిల్న మీ ఆస్తి ఆరెకరాల్లో ఒక ఎకరం అమ్ముతేగాని నీ చెల్లెలు అన్నపూర్ణ పెళ్ళి జరిగింది కాదు. నీలాగానే గుంటూర్లో నా పెద్దన్న సుబ్బారావు వద్ద నీ తమ్ముడు ప్రసాదు బాధ్యతల్తో చదువుకుంటున్నాడు. వాడు యీ ఏడు పాసవుతే వచ్చే ఏడు ఇంటర్లో చేర్చాట్టే. మీ బాధ్యతల్ని కాస్త సక్రమంగా నడపడం మా వంతైనా, మీ ముందు జీవితాలు బాగుపడేందుకు గట్టి చర్యలు తీసుకోడం మీ అన్నదమ్ముల వంతు కొంతా, ఆ ఈశ్వరానుగ్రహం మరికొంతా వుండక తప్పదని కోరుకుంటున్నాం".

వారం అయినాక ఒక సాయంత్రం రోజు వస్తున్న అరడజను ట్యూషను విద్యార్థులతో పాటు ఆ రోజు కనకం కూడా వచ్చి వసారాలో ఓ మూల కూచునుండటం

లోపల హాల్లో పడక్కుర్చీలో కూచుని కాముడు చిన్నమ్మ యిచ్చిన కాఫీ తాగుతున్న శ్రీరామమూర్తి చూశాడు.

"నేను మన వూరు వచ్చేప్పుడు గొడ్ల పిల్లకాయల్తో వున్న ఆ కూచున్న కనకాన్ని చూశాను. మన వూళ్ళో ఆ పిల్లను మరెప్పుడూ నేను చూళ్ళేదు చిన్నమ్మా. ఆ పిల్ల నన్నెంతో అమాయకంగా పలకరించింది - ముందెప్పుడూ నన్ను చూడకపోయినా" అన్నాడు శ్రీరామమూర్తి కాఫీ కొంత పుచ్చుకొని.

"ఆ పిల్ల కనకానిది గుంటూరుకు పదిమైళ్ళలో వున్న ఓ పల్లెటూరు. ఆ పిల్ల తండ్రికి మన వూళ్ళో వున్న బసవపున్నయ్యకు చుట్టరికాలు వుంటంవల్ల, బసవ పున్నయ్యకి కాస్త ఆస్తి వుండంవల్లా యిరవై ఏళ్ళు తన కూతురు కన్న పెద్దవాడైనా, కనకాన్ని బసవ పున్నయ్యకిచ్చి యీ మధ్య పెళ్ళి చేశాడు ఆ పిల్ల తండ్రి. కాని, కనకం చేసుకున్న మొగుడు బసవ పున్నయ్య ఆరోగ్యం అంతముందల్లే కనిపించదు. యీ మధ్య ఓ నెలరోజులు పడకేసినట్టున్నాడు బసవ పున్నయ్య" అంది కాముడు చిన్నమ్మ, పక్కనే కూచుని చాటలో బియ్యంలో మట్టి గడ్డల్ని ఏర్తు.

"మనిషనే వాడికి ఎక్కడో ఎందుకో అనారోగ్యం కలగచ్చు" అన్నాడు శ్రీరామమూర్తి - ఎటూ మొగ్గకుండా.

"దగ్గిర అందుబాట్లో వున్న యిద్దరు వైద్యులకు బసవ పున్నయ్యను చూపించారుటగాని బస్తీ తీసుకెళ్ళి చూపించడం మంచిదన్నారట ఆ వైద్యులు. 'అదే సద్దుకుంటుందిలే' అని బసవ పున్నయ్య అన్నాడు. ఆ పిల్లను వదల్టం యిష్టం లేక కావచ్చని యిక్కడ వారనుకుంటున్నారు" అంది కాముడు చిన్నమ్మ.

"పల్లెటూరు తత్వాలు అదోరకంగా వుంటయ్. ఆ పిల్లకు చదువు ధ్యాస వున్నట్టుంది - యిక్కడ బాబాయి ధగ్గర చదువుకుంటానికి అత్తమామలు, మొగుడు యిష్టం వుంటుందా?" అన్నాడు శ్రీరామమూర్తి.

"కొత్త కోడలు. వాళ్ళకు యిష్టం లేకుంటే యీ పన్లు చేస్తుందా? తన పుట్టింట తనకు చదువు ధ్యాస వుండేదని చెప్పేదట. మన పల్లెటూరి బడాయి కూడా తమ కోడలు చదువొచ్చిన పిల్లని చెప్పుకునే మోజు వుండేటటువంటిదే" అంటూ వంటింటో ఎసట్లో బియ్యం పోయడానికి వెళ్ళింది కాముడు చిన్నమ్మ.

ప్రయివేటు చెబుతున్న శివశాస్త్రి పొడుం కాయలోంచి ముక్కుపొడుం రాలక పోవటం చూసుకొని తొందరగా కోమటి దుకాణం వద్దకు వెళ్ళొస్తానని - పిల్ల కాయల్ని చదువుతుండమని బయటికి వెళ్ళంగానే కనకం తను చూసుకుంటున్న రెండు పుస్తకాలు అక్కడ పెట్టి హాల్లోకొచ్చింది.

"అమ్మగారు లోనకెళ్ళారా - యింతకు ముంగలే యీడుంటం చూశానే" అంది కనకం శ్రీరామమూర్తిని చూసి.

"యిప్పుడే మళ్ళీ రావచ్చు - అవసరంగా పనేమైనా వుందా?" అడిగాడు శ్రీరామమూర్తి.

"భావనల్లం వుందంట, కాత్తె యిత్తానంది, నిన్న మంచినీలబావి కాడ."

"నేనడిగి తెచ్చిపెట్టనా - లేకపోతే నువు పాఠం అయి వెళ్ళేముందు అడిగి తీసుకోవచ్చు. ఏమిటి నువు చదువుతున్నది?"

"సిన్న సదువు. నా అన్న కేశవులు ఎనక కాత్తె సెప్పేవోడు. నీ సదువు సెన్నాపట్టంలోనా? మీ పిన్నమ్మ నిన్న బావి కాడ సెప్పింది. పెద్ద సదువంటగా?"

"బళ్ళో చదివే పెద్ద చదువులనేవి కడుపులు నింపుకునే వుద్యోగాల కోసమేనని నా వుద్దేశ్యం. లోకజ్ఞానం, సంస్కారం అబ్బే చదువు దారి వేరు"

"నా కేశవులన్న కాత్తె తేడాగా అదే మాటనేవోడు. వత్తా - సదువుకోవాలి - ఎల్లే ముంగల భావనల్లం అడిగి తీసెకెల్తా" వెళ్ళి వసారాలో వున్న పిల్లల్తో కలిసింది కనకం.

"కనకానికి చదువు ధ్యాస యింకా వుందేమిటి; అన్న కేశవులు చదువు చెప్పే వాడంటుంది; కాని బసవ పున్నయ్యను పెళ్ళి చేసుకున్నాక బుద్ధి రావాలి కదా; మొగుడు రోగిష్టి వాడని తెలిసినాక మొహంలో మార్పు కనిపించాలి; కాని చీమ కుట్టినట్టు లేకుండా బఱ్రెగొడ్లను మేపడం; యింటి పన్లు చేయడం, చదువుపట్ల కూడ మనసుంచుకుంటున్నది! కనకానికి చిన్నపిల్ల లక్షణాలు పోలేదా? పెళ్ళి అనుభవం కలగలేదా? లేక పిచ్చిపిల్లా?" అని కనకం గురించిన ఏవో ఆలోచనలు కొన్ని కలక్కపోలేదు శ్రీరామమూర్తికి.

తనకు పదహారో ఏటే బాబాయి వాళ్ళు పెళ్ళి చేశారు. కాని, రెండేళ్ళ క్రితం చచ్చిపోయింది తన భార్య తులసి. తులసి మంచి పిల్లయి వుండవచ్చు. తనను ఎంతో కనిపెట్టి చూసినట్టు లేదనుకున్నాడు. తులసిలో తను మొగుడనే భావం బాగా వున్నట్టు కాముడు చిన్నమ్మ అనేది కాని సమాజం, లోకం, చదువు - సంస్కారం గురించి చిన్నమెత్తు తెలుసుకుంటం ఎరగదు తులసి. కాని తనకు క్షయ పెట్టుకొని తను క్షీణం అవుతున్నా కుమిలేది కాదు - అలాగే తీసుకుంటూ పోయింది.

శివశాస్త్రి పిల్లల ట్యూషను ముగించి, వంటింటో భార్య నడిగి భావనల్లం తెచ్చి కనకానికిచ్చి పంపేసి, శ్రీరామమూర్తి పక్కన ఒక నులక మంచం వాల్చి నిట్టూరుస్తూ కూలబడ్డాడు.

"ఒరె రాముడూ, నువు మళ్ళీ పెళ్ళి చేసుకో. నీకన్నా పెద్దవాణ్ణి, నీ మేలుకోరే ఆలోచనలు గలవాణ్ణి గనక ఎందుకిలా అంటున్నానో కాస్త గ్రహించు" అని కాస్త ముక్కుపొడుం పీల్చాడు శివశాస్త్రి బాబాయ్.

"నా చిన్నతనంలో ఒకసారి చేశారు – యిపుడదే ధోరణిలో నన్ను యిరికించడం యిప్పట్నించీ ఎందుకు బాబాయ్? యిప్పుడు నాకా ధ్యాస లేదు".

"లేకపోవచ్చు. కాని మనిషి జన్మకు భార్యాభర్తల రూపంతో జీవితాలనేవి నిండుగా వుంటూ ప్రయాణిస్తూ వుంటం మనం పరిశీలిస్తే, విషయాలు సులభంగా యిట్టే తేలి వూరుకుంటయ్. మన కాలం ఎప్పటికైనా అదేనని నీకు నేను చెప్పక తప్పదు" అని మరోసారి ముగింపు పొడుం పీల్చాడు శివశాస్త్రి బాబాయి.

"ఆ కాలం వచ్చిందనిపిస్తే నేను బయటపడ్తాలే బాబాయ్" సందిగ్ధంగా తర్కాన్ని కుదించాడు శ్రీరామమూర్తి.

కొద్దిరోజుల్లో గుంటూర్లో పెత్తండ్రి దంపతుల్ని పెళ్ళయిన వారి యిద్దరి కూతుళ్ళ విషయాలతోబాటు వారివద్ద వుంటూ చదువుకుంటున్న తన తమ్ముడు ప్రసాదునూ, అక్కడికి పది మైళ్ళ పల్లెటూర్లో పెళ్ళయి కాపరం చేస్తున్న తన చెల్లెలు అన్నపూర్ణను చూసి బంగారుపాలెం తిరిగివచ్చి, మద్రాసు ప్రయాణం అయినాడు శ్రీరామమూర్తి – కాలేజీ తెరుస్తారు గనక.

రెండెడ్ల బండి స్టేషను దాకా ఎక్కనన్న శ్రీరామమూర్తి పెట్టె, బెడ్డింగు ఒక కూలీవాడికి తగిలించి, వూరి బయటదాకా సాగనంపటానికొచ్చిన శివశాస్త్రి "నీ విషయం బాగా ఆలోచించి యింకో మంచి సంబంధం గురించి విచారిస్తున్నాను. నువు మద్రాసు వెళ్ళిన కొద్ది రోజులకు ఉత్తరం రాస్తాను. పెద్దవాళ్ళ మాట కాదనబోకురా చిన్నతండ్రీ!" అని శ్రీరామమూర్తి చెవిన యింకోసారి వేసి వూళ్ళోకి తిరిగి వెళ్ళాడు.

కొన్ని సొంత విషయాలు అంతగా తనకు పట్టకపోయినా శివశాస్త్రి బాబాయి తన విషయాలు ఎక్కువ పట్టించుకుంటాడని శ్రీరామమూర్తి మనసుకు తెలియక పోలేదు.

జూన్ నెల ముగిసే సమయం. పొలాల్లో నాట్ల పనులు ముమ్మరంగా సాగుతూంటం చూసిన శ్రీరామమూర్తి మనసు మళ్ళీ చాలా కాలానికి చిందులేసింది – ఆ నాట్ల మనుషుల్ని చూస్తూ, రోడ్ల పక్క మేయడాని కొచ్చిన బర్రెగొడ్లు, సాయంకాలం యిళ్ళకు తిరిగి వెళ్తుంటే వాట్ని చూసుకునే గొడ్ల పిల్లకాయల్తో బాటు కనకం వాళ్ళ చివర్న ఒక పేడ బుట్టతో కనుపించింది శ్రీరామమూర్తికి.

"ఏం కనకం, చాలారోజులకు కనుపించావు మళ్ళీ, నేను చదువుకు మద్రాసుకు వెళ్తున్నా" అన్నాడు శ్రీరామమూర్తి కనకం దగ్గరకు రాంగానే.

"నాకు తెలుసు నువు మద్రాసు వెళ్తావని" అంది కనకం నెత్తిన పేడబుట్టతో నుంచుంటూ.

"నీకు తెలుసని అనుకోలేదు. మీ ఆయన బసవ పున్నయ్య ఆరోగ్యం బాగుందా? నా కెందుకో మీ యంటికొచ్చి బసవ పున్నయ్యను పలకరించ బుద్ధి పుట్టలేదు?"

"ఎందుకనేం?"

"మీ ఆయన నీ కన్న చాలపెద్ద. తను రోగిష్టి వాడని తెలిసే నిన్ను పెళ్లి చేసుకున్నాడనిపించింది నాకు, ఎందుకనో. ఆ విషయం నీ మనసు కెక్కినట్టు కూడా నువు కనిపించవు నాకు" అనేశాడు శ్రీరామమూర్తి.

"మా గురించి నువు సానా అనుకుంటావే! పోనీ, అదే సాలు యిప్పటికి! ఆయనకి వొంటో బొత్తిగా బాగుంటం లేదు. తనకు లోన ఏం లేదంటాడు, యియాల్టికి కూడా" అంది కనకం, విచారం బయటపడకుండా.

"కనకం, మీ క్షేమం బాబాయికి తెలుపుతే నాకు రాసే జాబుల్లో తెలుపుతుంటాడు – యింక నీతో ఎక్కువ మాట్లాడలేను – వస్తా" అంటూ ముందుకు కదలి వెళ్తున్న శ్రీరామమూర్తిని వెనకనుంచి కాసేపు చూసిన కనకం, వెళ్ళి బఱ్ఱెగొడ్ల పిల్లకాయల్తో కలిసింది.

'తన స్వజాతకంపై తనకెలాంటి అధికారం లేదు. అధికారంతో తను జీవితాన్ని అదుపు చేసుకునేది మటుకు తనకు స్వజ్ఞానం మీద నమ్మకం వున్ననాడే సాధ్యం' అనుకున్నాడు ఓరోజు శ్రీరామమూర్తి మద్రాసులో – తనకు బాబాయి శివశాస్త్రి రెండో పెళ్ళి చేసిన కొద్ది రోజులకు.

తనకు నీలవేణి అనే పిల్లతో రెండో పెళ్ళి – రెండో వర్షం తను మద్రాసు వచ్చిన రెణ్ణెల్లకే జరగటం, శివశాస్త్రి బాబాయి తన గురించి అధికంగా ఆలోచించడం వల్లనే సాధ్యమయిందది. తనకు శివశాస్త్రి బాబాయి 'శ్రీరామరక్షంత పెట్టు' అని అనుకున్నాడు శ్రీరామమూర్తి.

అందుకే తను మద్రాసులో చదువుతున్నా ఆటంకాలు అంతగా ఉండవని నీలవేణితో ఓ చిన్న అద్దె యింటో కాపురం పెట్టించాడు బాబాయి. కాని ఒక పైశాచిక చర్య – తనపై విరుచుకు పడగలదనే ఆలోచన తన కెందుకు తడ్తుంది? పెళ్ళయి, కొత్త కాపరం పెట్టిన రెండు వారాలకే నీలవేణి న్యుమోనియాతో చచ్చిపోయింది అకస్మాత్తుగా! యిది పిచ్చి పుట్టించే సంఘటన! యీ సంఘటన తన హస్తముద్రిత జాతక రేఖల్లో ముందే నిర్ణయమైందా?

కాని, యీ సంఘటనతో బాటు తనకు కలిగిన అనుభవాలు కొన్ని తనను

వెంబడించక పోలేదు. కొత్తగా కాపరానికొచ్చిన నీలవేణి తనతో మనసు కలిపిన ధోరణి చూపలేదు. రాత్రిళ్ళు పక్కలో తనకు మనసివ్వలేదు. నోరెత్తి తన మనసును బయట పెట్టలేదు. తమకు జరిగిన పెళ్ళి గురించి తనే మనుకున్నదీ ఆ పిల్ల మాట కూడ అనలేదు. యిది ఏ రకం తత్వం? అతనిలో ఏర్పడుతున్న మానసిక సంచలనం వల్ల ఒక కొత్త లక్షణం బయట పడింది. అది, రచనా విధానం వైపుగా అతని బుద్ధి మళ్ళి – రచనలకు వుపక్రమించడమే! రెండు వార పత్రికల్లో నచ్చిన తన కథలను ప్రచురించడం జరిగింది. హైదరాబాదు ప్రాంతంలో వుంటున్న శ్రీహరి అనే తన మిత్రుడు ఆ రెండు కథలు తనకు ప్రత్యేకంగా నచ్చినవని రాశాడు.

నీలవేణి మరణించిన వార్త విన్న రెండో రోజుకే శివశాస్త్రి బాబాయి, కాముడు చిన్నమ్మలు వచ్చి మద్రాసులో తనవద్ద యిరవై రోజులుండి స్వగ్రామం తిరిగి వెళ్ళారు. బంగారుపల్లె చేరిన ఒక వారానికి ఒక ఉత్తరం – తన క్షేమం గురించి తెలపమని రాస్తూ చివర్న రెండు ముక్కలు తెలిపాడు – కనకం మొగుడు బసవ పున్నయ్య యిరవై రోజుల క్రిందట – తాము మద్రాసులో వుండగా పోయినాడనీ, పదిహేను రోజుల తరువాత కనకం పుట్టింటికి వెళ్ళిందనీ తెలిపాడు శివశాస్త్రి బాబాయి.

కనకం గురించిన వార్త అందిన కొద్దిరోజులకే జరిగిన తన ఫైనలు పరీక్షల్లో తను ఎలా రాయగలిగిందీ శ్రీరామమూర్తి స్పష్టంగా తనకు తాను చెప్పుకోలేక పోయినాడు.

వేసంగికి మద్రాసు ఖాళీ చేసి, బంగారుపల్లె వచ్చి శివశాస్త్రి బాబాయి, చిన్నమ్మలను చూసిన రెండో రోజుకు అక్కడ వుండలేక గుంటూరు వెళ్ళి పెదనాన్న వాళ్ళను, తమ్ముడు ప్రసాదును చూసి, పది మైళ్ళ దూరం పల్లెటూర్లో వున్న చెల్లెలు అన్నపూర్ణను కూడా చూసి రావటానికి బయలుదేరాడు శ్రీరామచంద్రమూర్తి.

చెల్లెలు అన్నపూర్ణకు ఆ మధ్య గర్భస్రావం కలిగి విచారంలో ఉన్నది కాస్తా అన్న శ్రీరామమూర్తిని చూసి ఆనందం పట్టలేక తన విచారాలన్నిట్నీ మింగి – ఒక నెల అయినా అన్న అక్కడ లేకపోతే మర్యాద దక్కదని, వీధిలో పోయేవారి చెవిన కూడా పడేంత బిగ్గరగా అరచి చెప్పింది.

అన్నపూర్ణ భర్త కామేశ్వరరావు బి.ఏ. బి.ఇడి. చదవి బస్తీలో వుద్యోగ తాపత్రయంలో వుంటున్నా, తండ్రి పోవడం వల్ల పల్లెటూరొచ్చి పదిహేనెకరాల సుక్షేత్ర భూమిని చూసుకోక తప్పలేదు. బావమరిది శ్రీరామమూర్తి సామాన్య సంఘజీవిగా కన్న, ఒక మెట్టు పైనుండే పడుచువాడని ఎప్పుడో గ్రహించిన బావ కామేశ్వరరావు, బావమరిది తన పల్లెటూరు రానే వచ్చాడని చదువు, సాహిత్యం, రాజకీయాలు, లోకాన్నావరించిన సిద్ధాంతాల్ని గురించి రెండు రోజులు ఏకధాటిగా చర్చలు పేల్చేశాడు.

మూడోరోజు సాయంకాలం తన పొలాల వేపు వెళ్దొద్దామని బావమరిది శ్రీరామమూర్తితో వూరి బయటకు కంకర్రోడ్డు మీదకు వచ్చిన కామేశ్వరరావు రోడ్డుకు అడ్డంగా పార్తోన్న చిన్న పంటకాలవలపై వున్న షుమారైన వంతెన మీద కాకీ చొక్కా, కాకీ పాంటు వేసుకుని మాసిన గడ్డంతో కూచునున్న ఒక వ్యక్తిని చూసి బాగా దగ్గరకొచ్చిగాని గుర్తుపట్ట లేదతన్ని.

"ఓస్- నువా కేశవులూ! చాలా మారిపోయినావేంటి - దగ్గిర కొచ్చినా అంత తేలిగ్గా గుర్తుపట్ట వీల్లేకుండా? చాలా కాలమైంది మనం కలుసుకుని - ఎప్పుడొచ్చా మన వూరికీ? పాత మిత్రుణ్ణి పలకరించాడు, కామేశ్వరరావు.

"బాగుండావా కామేశం అన్నా? నా చెల్లెలు మొగుడు పోయినాడని తెలిసి నిన్న వచ్చా! చాలా అన్యాయం జరిగింది దానికి" కుంగిన మనిషల్లే అన్నాడు కేశవులు.

"యిక్కడకు చేరినాక నీ చెల్లెల్ని చూశాను కేశవులూ. చాలా అందంగా వుండే నీ చెల్లెలికి ఒక విధంగా నీ తండ్రి చాలా అన్యాయం చేసినమాట నిజం - నువే మనుకున్నా సరే" అన్నాడు కామేశ్వరరావు.

"నువు అన్నది నిజం అని నాకెప్పుడో తెలుసు కామేశం అన్నా. ఆ చచ్చినవాడికి చెల్లెల్ని యివ్వద్దని చాలా మొరాయించి చివరకు పెళ్ళికి వెళ్లకుండా యింకో వూరెళ్ళాను. అప్పట్లో చెల్లి ఏం తెలుసుకునేది కాదు" అన్నాడు కేశవులు.

"పాపం అమాయకురాలు; కాని వారం కిందట నేను మాట్లాడినప్పుడు చాలా మార్పు వచ్చినట్టుంది ఆ పిల్లలో. యిప్పుడు తన కోసం తను నిలబడగలదనిపించింది నాకు. యితను నా బావమరిది శ్రీరామమూర్తి; మద్రాసులో మొన్న ఎమ్.ఎస్.సి. ఫైనలు పరీక్ష రాసి వచ్చాడు" అన్నాడు కామేశం, కేశవులుకు బావమరిదిని పరిచయం చేస్తూ.

"నీ చెల్లెలి పేరు కనకం కాదూ?" అడిగాడు శ్రీరామమూర్తి కేశవుల్ని సూటిగా చూస్తూ!

"అవును. కనకాన్ని నువు ఎరుగుదువా? నీది బంగారుపల్లె అనుకుంటా" అన్నాడు కేశవులు, శ్రీరామమూర్తిని పరీక్షిస్తూ.

"అవును. బడిపంతులు మా శివశాస్త్రి బాబాయి యింటి వద్ద చదువుకుంటాని కొచ్చినప్పుడు, రెండుసార్లు బర్రెగొడ్లు కాచుకునేప్పుడు మీ కనకాన్ని చూడడం, పలకరించుకోటం జరిగింది. విచిత్రమైన పిల్ల. ఒకసారి నిన్ను గురించి నాతో కనకం చెప్పింది కూడా, నువు తనకు చదువు చెపుతావని - మీ యింటికొచ్చి ఆ పిల్లను చూడొచ్చా? ఆ పిల్ల మొగుడు పోయినపుడు నేను మద్రాసులో వున్నా".

"నువు కేశవుల్తో వాళ్ళింటికి వెళ్ళి కనకాన్ని చూసిరా శ్రీరామమూర్తీ – నాకు అవసరంగా పొలం పన్లున్నయ్. పనవుతే నేనూ కేశవులింటికి వస్తా. కేశవులు చాలా మంచి మెకానిక్. హైదరాబాదులో వుద్యోగంలో వున్నాడు. నేను వస్తా–" కామేశ్వరరావు వెళ్ళగానే కేశవుల్తో వాళ్ళింటికి వెళ్ళాడు శ్రీరామమూర్తి.

కేశవులు తండ్రి, తల్లి వుండే సొంత పూరిపాక చిన్నతోటలో వుంది. తండ్రి పాకలో లేడు. కేశవులు లోపల వంటు చేస్తున్న తల్లి వద్ద వున్న కనకంతో చెప్పగానే పంచలో నులకమంచం మీద కూచున్న శ్రీరామమూర్తి దగ్గరకొచ్చి అతన్ని వింతగా కన్నార్పకుండా చూస్తూ నిలబడిపోయింది.

"మీది యీ వూరని, నిన్ను యిక్కడ చూడగలనని పొరపాట్న కూడ అనుకోలేదు కనకం! నా బావ కామేశ్వరరావు ద్వారా నీ అన్న కేశవుల్తో పరిచయం అయి యిక్కడికి రాగలిగాను. నేను మద్రాసులో వుండగా బంగారుపల్లెలో నీకు భర్త పోయిన విషయాలు శివశాస్త్రి బాబాయి వుత్తరం రాశాడు. నీ గురించి ఎక్కువ బాధపడ్డాను" అన్నాడు శ్రీరామమూర్తి, కనకం కళ్లల్లో తన కళ్ళు కలిపి.

"బసవ పున్నయ్యతో నాకు పెల్లయిందని అనిపియడం లేదు. ఆయన మంచాన పడి తీసుకుంటూ పోవడం మటుకు నాకు లోన తొలిసింది! నేననుకోలేదు – మీరు యిక్కడ నన్ను సూట్టాని కొస్తారని" అంది కనకం, గోడకు ఆనుకొని.

"నాకీ మధ్య రెండో పెళ్ళి కూడా అయిపోయి మద్రాసులో కాపురం పెట్టిన కొద్ది రోజులకే ఆ పెళ్ళాం న్యుమోనియాతో పోయింది. నాకు ఎక్కడా ఎక్కువ రోజులు వుండబుద్ధి పుట్టక నా చెల్లెలు, బావ దగ్గర కొచ్చాను" అన్నాడు శ్రీరామమూర్తి స్వవిషయం కుదిస్తూ. తలవొంచుకొని, "నాకు తెలుసు నీ రెండో పెల్లాం పోవడం" అంది కనకం.

కేశవులు అడిగాడు, "యిటీవల 'రామ్' అనే రచయిత మద్రాసు వార పత్రికల్లో రెండు కథలు హైదరాబాదు రజాకార్ల గురించి రాసినవి, చదివాను – అతనెవరో నీకేమైనా తెలుసా?"

"తెలుసు. ఆ రజాకార్ల గురించి ప్రత్యక్ష అనుభవం వుంటే యింకా బాగా రాయవచ్చు. శ్రీహరి అనే నా సన్నిహిత మిత్రుడు కథలు చదివి నాకో లేఖ రాశాడు. ఆ కథలు బాగున్నవనీ, తాను రజాకార్ల ఘోర కిరాతకాలకు వ్యతిరేక వుద్యమంలో వున్నానని రాశాడు" అన్నాడు శ్రీరామమూర్తి.

"నీ పేరు 'రామ్' అనే పొట్టి పేరుకు కుదించుకున్నావనుకుంటా" అంది కనకం.

"యిటీవలే కథలు రాయటం మొదలుపెట్టాను. శ్రీహరిని చూడాలని మనసు పీకుతున్నది – బహుశ తొందర్లో ఆ పని చేస్తాను" అన్నాడు శ్రీరామమూర్తి.

"నువు ఆట్టే బాధ పడకుండా అతన్ని చూడొచ్చు – నాతో వస్తే. మేమిద్దరం యింకా చాలామంది కలిసి రహస్యంగా అక్కడి అడువుల్లో వుంటూ రజాకార్ల హంతకులతో పోరాడుతున్నాం. ఆడవాళ్ళను నడిబజార్లో చెరచడం, ప్రజల్ని నరికి ముక్కలు చేస్తూ యిళ్ళ మీద పడి దోచుకోవడం అక్కడివారికి నిత్యకృత్యమైంది. రక్తం తాగే కాశీం రజ్వీ అనే హంతకుడు వాళ్ళ నాయకుడు. నైజాం నవాబు పరిపాలన వర్ధిల్లేట్టు చేయగలనని వాడు శపథం చేశాడు. ఇంగ్లీషు వాళ్ళు మన దేశాన్ని వొదిలి వెళ్ళే కాలం వచ్చినా, తన పరిపాలన కాశీం రజ్వీ వల్ల స్థిరంగా వుంటుందని నైజాం నవాబు చంక లెగరేస్తున్నాడు; అందరి కళ్ళ ముందర – నైజాం నవాబు, కాశీం రజ్వీ, రజాకార్ల అంతం చూస్తామని అక్కడ విప్లవకారుల్తో శపథం చేశాం!" అంటున్న కేశవులు మాటలతో కలిపి –

"నేనూ అన్నతో పోయి ఆడ సంగంలో సేర్తుండానని అన్న కాడ శపథం చేశా" అంది కనకం.

"నేనూ శపథం చేస్తున్నాను మీతో కలవటానికి. నేను మద్రాసులోనే నిర్ణయించుకున్నాను, ఆ రజాకార్ల పోరాటంలో మిత్రుడు శ్రీహరితో కలుద్దామని. నువు అక్కడికి వెళ్ళటం నాకాశ్చర్యంగా వుంది కనకం!" అన్నాడు శ్రీరామమూర్తి కనకాన్ని చూస్తూ.

"నాకు తెలిసినంతగా యివాల్టి కనకాన్ని నువ్వెరగవు శ్రీరామమూర్తీ! అది నాతో ఆ పోరాటం వద్దకు రావటం ఖాయమైంది" అన్నాడు కేశవులు.

"యీసారి కనకం యిష్ట ప్రకారం ఆ పిల్లను ఎవరు పెళ్ళి చేసుకోగలిగినా అతను అదృష్టజాతకుడే. నాది ముదనష్ట జాతకం అని లోగడ నాకు జరిగిన రెండు పెళ్ళిళ్ళకే నా భవిష్యత్తు తేలిపోయింది!" అన్నాడు శ్రీరామమూర్తి.

"ఎనక జరిగిన రెండు పెళ్లిల్లు నువు మనసుపడి చేసుకున్నవి కావు. యియాల ఏ పిల్ల మీద నీకు మనసు మల్లినా ఆ పిల్ల సానా అదురుష్టవంతురాలు!" అంది కనకం.

"నువ్వు చెప్పింది నిజం అవుతే ఆ పిల్ల కనకానికి మించింది కావటానికి వీల్లేదు!" అన్నాడు శ్రీరామమూర్తి – కేశవులు తన భుజం మీద చేయి వేస్తుంటే.